సాక్షి మంచిర్యాల

ఆదివారం । 11 । జూన్ । 2023

రేపు 2కే రన్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలో సోమవారం 2కే రన్ నిర్వహించనున్నట్లు ఏసీపీ పంతాటి సదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు మున్సిపాలిటీలోని తిలక్‌స్టేడియం నుంచి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, సింగరేణి అధికారులు హాజరవుతారని తెలిపారు. యువత, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

12న మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: మంచిర్యాలలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 12న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. డీమార్టు కంపెనీలో 300 రిటైల్ సేల్స్ అసోసియేట్ ఉద్యోగాల కోసం 10వ తరగతి నుంచి డిగ్రీ అర్హత ఉండి 18నుంచి 24ఏళ్లలోపు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు మంచిర్యాల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

ఆకాశం రోజంతా పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజీ మార్గమే రాజమార్గం

- జిల్లా న్యాయమూర్తి సత్తయ్య
- లోక్ అదాలత్‌లో 2,150 కేసులు పరిష్కారం

మంచిర్యాలక్రైం: ఏ సమస్యలోనైనా రాజీ కుదుర్చుకోవడం ఉత్తమమని, రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి బి.సత్తయ్య అన్నారు. శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో లోక్ అదాలత్ నిర్వహించారు. స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సత్తయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీ కుదుర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 2,150 కేసుల్లో ఇరువర్గాల కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నారని అన్నారు. కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. న్యాయవాదులు, పోలీస్ శాఖ అధికారులు కక్షిదారులతో మాట్లాడి పెండిగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ.ఉదయ్‌కుమార్, న్యాయమూర్తులు అజయ్, ఉపనిషధ్వని, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు దివ్యాంగుల కృతజ్ఞతలు



సుమన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దివ్యాంగులు

నస్పూర్: దివ్యాంగుల పింఛన్‌ను పెంచుతూ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమీకృత భవనం వద్ద ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్యే దివాకర్ రావులకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఇందూరి రమేశ్, బండోజు నరేశ్, రామ శ్రీనివాస్, ముల్కల రాజేంద్రప్రసాద్, సతీష్, రమణి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి సై



హాజీపూర్ మండలంలో బడిబాట

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 9వరకు చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ముగిసింది. ఇంటింటా ప్రచారంతో పిల్లలను చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఆంగ్ల మాధ్యమంలోనూ నాణ్యమైన చదువుపై అవగాహన కల్పించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు, ఆంగ్ల మాధ్యమంలో బోధనకు ఆకర్షితులయ్యారు. ప్రైవేట్‌లో ఫీజుల భారంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. వారం రోజులు సాగిన బడిబాటలో 460 పాఠశాలల్లో 2,350 విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇందులో ఒకటో తరగతిలో 1,432 మంది పాఠశాలల్లో చేరారు. 2వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రైవేట్ నుంచి 918 మంది విద్యార్థులు సర్కారు బడిలో చేరారు.

14నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



బెల్లంపల్లిరూరల్: ఈ నెల 14నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్ల ధ్రువీకరణ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల ధ్రువీకరణ ప్రక్రియ 18 వరకు ఉంటుందని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 19 బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు పాలిసెట్ ర్యాంక్ కార్డు, హాల్‌టికెట్, పదో తరగతి మార్కుల మెమో, 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు. సర్టిఫికెట్ల ధ్రువీకరణ అనంతరం కళాశాల, కోర్సుల ఎంపిక ఆన్‌లైన్‌లో ఈ నెల 16 నుంచి 21వరకు, 25న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటాయని వివరించారు. సీట్లు కేటాయించిన తర్వాత విద్యార్థులు 25 నుంచి 29వరకు ఆయా కళాశాలల్లో ట్యూషన్ ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని సూచించారు.

బీఆర్‌ఎస్‌లో జోష్ !



మంచిర్యాలలో సభకు హాజరైన ప్రజలు(ఫైల్)

- సీఎం పర్యటనలతో కేడర్‌లో ఉత్సాహం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై గులాబీ బాస్ ఫోకస్
- ఈ నెల 24న ఆసిఫాబాద్ జిల్లాకు రాక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. వరుస సభల విజయవంతం ఉత్సాహాన్నిస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఈ నెల 2 నుంచి 22వరకు 21రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులు పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో కలెక్టరేట్ భవనాలు, అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రగతి నివేదన సభలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరిస్తున్నారు. ఈ నెల 6న నిర్మల్ జిల్లా పర్యటన, 9న మంచిర్యాల జిల్లాలో కొత్త కలెక్టరేట్లు, జిల్లా పార్టీ కార్యాలయాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ నెల 24న కుమురంభీం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. కలెక్టరేట్, పార్టీ కార్యాలయం ప్రారంభం, బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకే నెలలో వరుస పర్యటనలు ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ఎన్నికలకు ముందే..

వచ్చే శాసనసభ ఎన్నికలకు ముందే ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లను సీఎం ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను 'ప్రగతి నివేదన సభ'లో ప్రజలకు వివరిస్తున్నారు. కేసీఆర్ సభలకు తోడు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సైతం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. గత నెల 8న బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రగతి నివేదన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య నాయకుల రాకతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికలకు ముందే సభల నిర్వహణతో కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఎన్నికలు సమీపించే నాటికి తమ బలాన్ని పెంచుకునేలా అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. వచ్చే డిసెంబర్‌లోపు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమయాన్ని తమకు కీలకంగా భావిస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత, నాయకులు, ప్రజాప్రతినిధులపై అసంతృప్తిని తొలగించేలా జిల్లాల్లో పర్యటనలు, సభలు చేపడుతున్నారు. ఎన్నికలకు ముందే భారీగా వ్యయం చేస్తూ సభలు విజయవంతం అయ్యేలా ప్రణాళిక రచిస్తున్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు తిప్పికొట్టేందుకు, అధికార పార్టీ ఎమ్మెల్యేలకు బలం చేకూర్చేలా అగ్రనాయకుల పర్యటనలు సాగుతున్నాయి.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు, నిరసనలు తిప్పికొట్టేలా, ప్రజల్లో అధికార పార్టీపై పట్టుకోల్పోకుండా వ్యవహరిస్తున్నారు. వరుసగా రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో మూడోసారీ విజయం సాధించేందుకు బీఆర్‌ఎస్ సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రస్తుత ఎమ్మెల్యేలందరూ వరుసగా రెండు మూడు సార్లు గెలిచిన వారే ఉన్నారు. వీరిపై సాధారణంగా జనంలోనూ వ్యతిరేకత ఉంది. దీంతో మరోసారి అధికారంలోకి రావాలంటే ఎన్నికలకు ముందే సమగ్రంగా ప్రణాళికలు వేసుకుని అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ, తదితర పార్టీలు బలపడకుండా ముందే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

గ్రూప్-1 పరీక్షకు సిద్ధం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ మేరకు జిల్లా కేంద్రం మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి తదితర చోట్ల 27పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటికే అన్ని సిద్ధం చేశారు. జిల్లాలో పరీక్ష రాసే అభ్యర్థులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. పరీక్షకు పదిహేను నిమిషాల ముందే అంటే 10.15గంటలకు పరీక్ష కేంద్రం గేటు మూసివేస్తారు. ఆ తర్వాత అభ్యర్థులను పరీక్షకు అనుమతించరు. నిర్ణీత సమయంలోనే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించాలి.

రెండోసారి పరీక్షకు

జిల్లాలో గత అక్టోబర్ 16న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 9,243మంది అభ్యర్థులు స్థానికంగా పరీక్ష కేంద్రాలు ఎంపిక చేసుకున్నారు. ఇందులో 7,259మంది పరీక్ష రాశారు. పేపర్ లీకేజీ వ్యవహారం బయటపడడంతో పరీక్ష రద్దయింది. దీంతో మొదటిసారి పరీక్ష రాసిన అభ్యర్థులు మరోమారు పరీక్ష రాస్తున్నారు. మొదటిసారి కొందరు అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్షలో నెగ్గారు. పరీక్షలు రద్దవడంతో తాజాగా మళ్లీ రాసేందుకు సన్నద్ధం అయ్యారు.

అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 11న జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,243 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఓఎంఆర్ షీట్‌లో ఇన్విజిలేటర్‌తోపాటు అభ్యర్థి సంతకం చేయాలని, ఓఎంఆర్ షీట్‌లో తప్పిదం జరిగితే మార్పు చేయడం జరగదని, హాల్‌టిక్కెట్‌పై ఫొటో అతికించి గెజిటెడ్ అధికారి సంతకం తీసుకోవాలని, అదనంగా మరొక ఫొటోపై గెజిటెడ్ అధికారి సంతకంతోపాటు ఒక పాస్‌పోర్టు సైజ్‌ఫొటో తీసుకు రావాలని సూచించారు. స్క్వాడ్, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

అద్దాలు సరే.. మరి ఆపరేషన్ !



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

- కంటి సమస్యలకు అద్దాలు ఇచ్చిన వైనం
- శస్త్ర చికిత్సలకు జీజీహెచ్‌కు రెఫర్‌తో సరి
- జిల్లాలో ముగిసిన కంటి వెలుగు కార్యక్రమం

మంచిర్యాలటౌన్: ప్రజల్లో కంటి చూపు సమస్యను నివారించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటివెలుగు రెండో విడత కార్యక్రమం జిల్లాలో ముగిసింది. ప్రతీ నలుగురిలో ఒకరికి కంటి సమస్య ఉన్నట్లు వైద్యబృందం గుర్తించింది. దగ్గరి చూపు సమస్య ఉన్న వారికి రీడింగ్ అద్దాలు ఇవ్వగా, దూరం చూపు, ఇతర దృష్టి సమస్య అధికంగా ఉన్న వారికి ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ చేసి ఆర్డర్ చేయగా వచ్చిన వాటిని అందజేస్తున్నారు. దృష్టి సమస్య తీవ్రంగా ఉన్న వారికి ఆపరేషన్‌లు చేయాల్సి ఉన్నా.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో కంటి శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించి చేతులు దులిపేసుకున్నారు. దీంతో రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో కేవలం అద్దాలతోనే సరిపెట్టారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించకపోవడంతో వారు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రావడం లేదు. 18 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే కంటి పరీక్షలు నిర్వహించగా, 40 ఏళ్లు పైబడిన వారిలోనే కంటి సమస్య అధికంగా ఉన్నట్లుగా గుర్తించారు.

కంటి సమస్యకు అద్దాలే..

జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారు 5,36,109 మంది ఉన్నారనే అంచనాతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కంటి వెలుగు నిర్వహించింది. జిల్లాలోని 310 గ్రామ పంచాయతీలు, ఏడు మున్సిపాలిటీల్లో 178 వార్డుల్లో 100 రోజులపాటు శిబిరాలు నిర్వహించారు. 4,10,988 మందికి కంటి పరీక్షలు చేసి దగ్గరి కంటి చూపు సమస్య ఉన్న వారు 68,908 మందిని గుర్తించి, రీడింగ్ అద్దాలు అందజేశారు. 61,460 మందికి ఇతరత్రా కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 55,614 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసెస్ ఇవ్వగా, 5,846 మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉంది. మొత్తంగా 1,30,368 మందికి కంటి సమస్యలు ఉన్నట్లుగా గుర్తించి రీడింగ్, ప్రిస్కిప్షన్ గ్లాసెస్‌లను అందిస్తున్నారు. కంటికి శస్త్రచికిత్సల కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఎలాంటి కార్యక్రమం నిర్వహించడం లేదు. దీంతో చాలామంది దృష్టి సమస్యలకు ప్రిస్కిప్షన్ గ్లాసెస్ తీసుకున్నారు. ఎవరెవరికి ఆపరేషన్లు అవసరమో కూడా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది వివరాలు సేకరించలేదు. దీంతో ఎంతమందికి శస్త్రచికిత్సలు చేయాలనే దానిపై స్పష్టత కొరవడింది. మొదటి విడతలో శస్త్రచికిత్సలు అవసరమైన వారి వివరాలను సేకరించి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అప్పుడు కొన్ని కారణాల వల్ల శస్త్రచికిత్సలు చేయలేదు. రెండో విడతలోనూ శస్త్రచికిత్సలపై దృష్టి సారించకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరుతో జిల్లా ఆసుపత్రి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మారింది. అన్ని విభాగాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు విధుల్లో చేరారు. శస్త్రచికిత్స చేసేందుకు అవసరమైన వైద్యులు ఉన్నా అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

జిల్లాలో కంటి వెలుగు శిబిరాల వివరాలు

కంటి పరీక్షలు	4,10,286
రీడింగ్ గ్లాసులు తీసుకున్నవారు	68,908
ఇందులో 40 ఏళ్లలోపు వారు	10,291
40 ఏళ్లు పైబడిన వారు	58,360
ప్రిస్క్రిప్షన్ గ్లాసులకు రెఫర్	61,460
ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ	55,614
ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్‌లు రావాల్సినవి	5,846

జీజీహెచ్‌కు రెఫర్ చేశాం



జిల్లాలో కంటి శస్త్రచికిత్సలు చేసుకోవాల్సిన వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేశాం. అవసరమైన వారు శస్త్ర చికిత్స చేసుకునేందుకు జీజీహెచ్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

– డాక్టర్ ఫయాజ్‌ఖాన్, జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి

సుపరిపాలనకు ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, వేదికపై కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- తెలంగాణ సుపరిపాలన దినోత్సవం

నస్పూర్: ప్రజలకు సుపరిపాలన అందించడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా శాఖల సముదాయ సమావేశ మందిరంలో తెలంగాణ సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమన్ కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి నరేందర్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆర్డీవో వేణు, డీఆర్‌డీఓ బి.శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌లతో కలిసి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ గతంలో మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ప్రజలు రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసాలు పడేవారని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ అధికార వికేంద్రీకరణ చేస్తూ నూతన జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి సేవలు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, వైద్యకళాశాల, 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతోపాటు పర్యాటక రంగంలో కవ్వాల్ పులుల అభయారణ్యం, శివ్వారం, గాంధారి ఖిల్లా వంటి అనేక అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఏర్పాటు చేశారని అన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో 2014కు ముందు 45వేలు ఉన్న విద్యుత్ కనెక్షన్లు 83 వేలకు పెంచినట్లు తెలిపారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని అన్నారు. టీఎస్ బీ పాస్ ద్వారా గృహ నిర్మాణాలు, పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

'కేసీఆర్ పర్యటనతో ఒరిగిందేమీ లేదు'



మాట్లాడుతున్న తులా ఆంజనేయులు

మంచిర్యాలటౌన్: కేసీఆర్ పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం కేసీఆర్ పర్యటనతో జిల్లాకు ఏదైనా మేలు జరుగుతుందేమోనని ఆశించామని, కానీ ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని ఆరోపించారు. పాత పథకాలు, పాత హామీలను మళ్లీ ప్రకటించారని పేర్కొన్నారు. సింగరేణిని బీజేపీ ప్రైవేటీకరణ చేస్తుందనే తప్పుడు ప్రచారాన్ని ఆపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, పెద్దపల్లి పురుషోత్తం, బోయిని హరికృష్ణ, మల్లిఖార్జున్, రాకేష్ రేన్వా, అశోక్, జైపాల్‌రెడ్డి, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



భీమిని: కొత్తపల్లిలో ఎగిరిపోయిన ఇంటి రేకులు



భీమారంలో జాతీయ రహదారిపై నిలిచిన నీరు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. కన్నెపల్లి మండలం కొత్తపల్లి, ఐతపల్లి గ్రామాల్లో దుర్గం ఇస్తారి, కొండపల్లి మారక్క, జుమ్మిడి రవి, జుమ్మిడి ప్రభాకర్, ఐత సంతోష్, ఒండ్ర గణపతి ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయి నిలువ నీడ లేకుండా పోయిందని, తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

భీమారం: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రుతు పవనాలు వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన అనంతరం భారీ వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లారీల కొరత కారణంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే బస్తాలపై రైతులు కవర్లు కప్పి ఉంచారు. అంకూసాపూర్‌లో వడ్లబస్తాలు లారీలో లోడింగ్ చేస్తుండగా వర్షం పడింది. లారీలో లోడ్ అయిన బస్తాలు తడవకుండా హమాలీలు లారీపై ప్లాస్టిక్ కవర్లు కప్పారు. మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారిలోని భీమారంలో వర్షం నీటితో రోడ్డు జలమయమైంది. వర్షం నీటిని తరలించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జైపూర్: మండలంలో గాలిదుమారంతో వర్షం కురిసింది. ఉక్కపోతతో ఇక్కట్లు పడ్డ ప్రజలకు మారిన వాతావరణ పరిస్థితులతో ఉపశమనం లభించింది.

వేతన సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీకి వివరిస్తున్న సింగరేణి అధికారులు

శ్రీరాంపూర్: బొగ్గు గనుల్లో పనిచేసే అధికారుల వేతనాల సమస్యలు పరిష్కరించాలని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) నాయకులు పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతను కోరారు. శనివారం మంచిర్యాలలో ఆయనను అసోసియేషన్ అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, సింగరేణి విభాగం ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్ల నుంచి అధికారుల వేతనాలు కార్మికుల కంటే తక్కువగా ఉన్నాయని, ఒకే సంస్థలో పనిచేసే వారికి వేతన వ్యత్యాసాలు క్రమపద్ధతిలో ఉండాలని పేర్కొన్నారు. కోలిండియా, సింగరేణిలో కార్మికులు, అధికారులకు మధ్య వేతనాల వ్యత్యాసం ఒక క్రమ పద్ధతిలో లేకుండా పోయిందని తెలిపారు. ఏ1 గ్రేడ్ సూపర్‌వైజర్ బేసిక్ 11వ వేతన ఒప్పందంతో రూ.71,031 కాగా, ఈ1 గ్రేడ్ అధికారికి రూ.40 వేలు మాత్రమే ఉందని తెలిపారు. పింఛన్‌లో కూడా రూ.6,230 తేడా ఏర్పడుతుందని, ఈ సమస్యను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద జోషి, కోల్ సెక్రెటరీ అమృత్‌లాల్ మీనా దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్రెటరీ అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ వైర్



తెగి రోడ్డుపై పడిన విద్యుత్ వైర్

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లోని అచ్చుత్‌రావుగూడంలో శనివారం సాయంత్రం విద్యుత్ వైర్ తెగి పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అచ్చుత్‌రావు గూడం, గజ్జిరెడ్డిగూడం గ్రామాల మధ్యలోని విద్యుత్ వైర్ తెగిపడడంతో విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో విద్యుత్‌ను నిలిపి వేసి వైర్లను తొలగించారు. ఈ విషయమై లైన్ మెన్ తిరుపతి మాట్లాడుతూ విద్యుత్ వైర్‌కు విద్యుత్ సరఫరా లేదని కేవలం ఐడిల్‌లో ఉందని, సమాచారం తెలియడంతో వెంటనే వెళ్లి వైర్లు తొలగించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గూడెం నుంచి మహారాష్ట్రలోని అహేరికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సోయం కిరణ్, మహారాష్ట్ర నుంచి గూడెం వైపు వస్తున్న అన్నాచెల్లెల్లు నికాడి పావని, నికాడి తిరుపతిల బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సోయం కిరణ్ తీవ్రంగా గాయపడగా అన్నాచెల్లెల్లు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కిష్టంపేటలో రోడ్డు ప్రమాదం



సంఘటన స్థలంలో కారు, బైక్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.... లింగంపల్లి గ్రామానికి చెందిన జీళ్ల శ్రీనివాస్, ఉడుత రామయ్య, ఎలుకుచి గట్టయ్యలు కిష్టంపేటకు బైక్‌పై వస్తున్న క్రమంలో చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కాగా 108లో ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్– వేంపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో దుర్గానగర్ విలేజ్ నంబర్ 10 సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు కిందపడి శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కాగజ్‌నగర్ జీఆర్‌పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ గౌడ్ తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఎల్లో కలర్ హాఫ్ టీ షర్ట్, గోధుమ కలర్ షార్ట్ ధరించి ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గేనా?

- సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కరువు
- రసాయనిక ఎరువులను వాడుతున్న రైతులు
- ప్రారంభం కానున్న వానాకాలం సీజన్



సాగుకు సిద్ధం చేసిన దుక్కులు

చెన్నూర్‌రూరల్: రైతన్నలను అప్పుల ఊబిలోకి లాగుతున్న వాటిలో రసాయనిక ఎరువులు ప్రధానమైనవి. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం సేంద్రియ సాగులో మేలు చేకూరుతుందని చెబుతుంది. ఎక్కడో కొంత మంది రైతుల్లో మాత్రమే మార్పు కనబడుతుంది. కానీ ఆశించిన మేర సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపడం లేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. సేంద్రియ ఎరువులపై సరైన ప్రచారం లేకపోవడంతో వీటిపై రైతులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంకా రసాయనిక ఎరువులతో సాగు చేసే రైతుల సంఖ్యే ఎక్కువే. రసాయనిక ఎరువులతో పంటలు సాగు చేయడంతో పెట్టుబడులు పెరిగి ఆశించిన దిగుబడులు రాక రైతులు నష్టపోవాల్సి వస్తుంది. రైతులు ఈ సమస్య నుంచి బయట పడేందుకు సేంద్రియ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గం. కానీ సేంద్రియ వ్యవసాయమే కరువైంది. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కరువైంది. రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గి పోతుంది. సరైన దిగుబడులు రావడం లేదు. ముఖ్యంగా రైతులకు పంటల సాగుకు పెట్టుబడులు పెరుగుతాయి. అదే సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు చీడ, పీడల బెడద తగ్గుతుంది. మంచి దిగుబడులు సాధించవచ్చు. తక్కువ ఖర్చుతో మంచి లాభాలను పొందే అవకాశం ఉంది. వ్యవసాయంలో రైతులకు సరైన సలహాలు, సూచనలు లేక రైతులు సేంద్రియ ఎరువుల వైపు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంటలకు సోకిన రోగాలకు ఏ మందులు వాడాలో తెలియక రైతులు వ్యాపారులు ఇచ్చే చౌకబారు, నకిలీ మందులను వాడుతూ నష్టపోతున్నారు. సేంద్రియ ఎరువులు ఆరుతడి పంటలకు, కూరగాయలకు ఎంతగానో ఉపయోగపడుతాయి. సేంద్రియ ఎరువుల్లో పండించిన పంటలు ఆరోగ్యానికి సైతం మంచివని వైద్యులు చెబుతున్నారు.

ప్రకృతి సిద్ధంగా సేంద్రియ ఎరువుల తయారీ....

సేంద్రియ ఎరువుల తయారీ విధానం ప్రకృతి సిద్ధంగా ఉంటుంది. ఆకులు, అలములు, చెత్త చెదారం, పశువుల పేడ, ఆవు మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. పంట పొలాల వద్ద కానీ, ఇంటి వద్ద కుండీలను ఏర్పాటు చేసుకుని అందులో ఆకులు, ఇతర వ్యర్థ పదార్థాలను వేసి దానిపైన పశువుల పేడను వేసి 45రోజుల ఉంచితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. రైతులు ఇళ్ల వద్ద, పెరళ్లలో, పంట పొలాల వద్ద ఇలాంటి ఎరువులను స్వంతంగా తయారు చేసుకొని పంటల సాగులో వినియోగించినట్లయితే మంచి లాభాలు పొందవచ్చు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం...



రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గి పంటలకు చీడ, పీడల బెడద ఎక్కువగా ఉంటుంది. రసాయనిక ఎరువులతో ఖర్చు కూడా పెరుగుతుంది. అదే సేంద్రియ ఎరువులు వాడితే పంటలకు ఎలాంటి చీడ, పీడలు సోకవు. మంచి దిగుబడులు వస్తాయి. ఆరోగ్యకరమైన పంట వస్తుంది. సేంద్రియ ఎరువులను రైతులు తమ పంట పొలాల వద్ద, ఇంటి వద్ద తయారు చేసుకోవచ్చు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహనలు కల్పిస్తున్నాం.

–జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత



రాజును అప్పగిస్తున్న సర్పంచ్ సంతోష్‌గౌడ్

చింతలమానెపల్లి: మండలంలోని అడెపెల్లి అటవీ ప్రాంతంలో తప్పిపోయి తిరుగుతున్న యువకుడిని శనివారం అడెపల్లి గ్రామస్తులు బంధువులకు అప్పగించారు. అడెపల్లి గ్రామ సర్పంచ్ వివరాల ప్రకారం... అడెపల్లి గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో తప్పిపోయి తిరుగుతున్న ఓ యువకుడు స్థానికులకు కనిపించాడు. స్థానికులు యువకుడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. సదరు యువకుడు అస్పష్టంగా మాట్లాడడంతో యువకుడిని గ్రామానికి తీసుకొచ్చి గ్రామస్తులు సర్పంచ్ సంతోష్ ఆధ్వర్యంలో భోజనం అందించి యువకుడి ఫొటో తదితర వివరాలతో సాంఘిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. యువకుడిని గుర్తు పట్టిన గూడెం గ్రామానికి చెందిన హన్మంతు తన పేరు రాజు అని, తనకు బావమరిది అవుతాడని తెలిపాడు. అనంతరం అడెపెల్లికి చేరుకోగా సర్పంచ్ సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో హన్మంత్‌కు అప్పగించారు.

పది నిమిషాలైతే బతికేవాడు..

- రోడ్డు ప్రమాదంలో గ్రామ కార్యదర్శి మృతి
- మాట్లాడుతూనే తల్లిఒడిలో ప్రాణాలొదిన కొడుకు
- అంబులెన్స్ టైర్ పంక్చర్ కావడంతో ఆస్పత్రికి ఆలస్యం..



వేణుగోపాల్(ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): లే.. బిడ్డా.. మమ్మల్ని ఇంత తొందరగా వదిలి వెళ్లావా..నాయనా! మేమేం పాపంచేశామని.. ఆ దేవుడు ఇంత అన్యాయం చేసిండు.. ఎవరిని కొడుకా! అని పిలవాలి నాన్నా.. అంటూ ఆ తల్లిదండ్రుల ఏడ్పునతీరు అక్కడివారిని కంటతడిపెట్టించింది. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుతాడనుకుంటే.. కారు రూపంలో మృత్యువు వెంటాడింది.. ఆసిఫాబాద్ మండల కేంద్రంలో కెస్లాపూర్‌లోని హనుమాన్ విగ్రహం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గేడాం వేణుగోపాల్(27) తీవ్రంగా గాయపడగా చంద్రాపూర్ ఆస్పత్రికి తరలించగా క్రమంలో పది నిమిషాలు ఆలస్యం కావడంతో మృతిచెందాడు.

కుటుంబీకుల వివరాల ప్రకారం...

ఆసిఫాబాద్‌లోని ఎస్‌జీవో కాలనీలో నివాసముంటున్న గేడాం నాగేశ్వర్, నిర్మల దంపతులకు ఒక కొడుకు.. ఇద్దరు కూతుర్లు. కుమారుడు వేణుగోపాల్ కెరమెరి మండలంలోని రకంజీవాడ గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం బైక్ సర్వీసింగ్ కోసం వేణుగోపాల్‌తో పాటు అనార్‌పల్లి గ్రామ కార్యదర్శి ప్రశాంత్ మంచిర్యాలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఆసిఫాబాద్‌లోని కెస్లాపూర్ హనుమాన్ విగ్రహం సమీపంలోకి రాగానే వీరి బైక్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వేణుగోపాల్, ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ప్రశాంత్‌ను మంచిర్యాలకు తరలించగా, వేణుగోపాల్‌ను చంద్రాపూర్ ఆస్పత్రికి తరలించారు.

పది నిమిషాల ఆలస్యంతో...

వేణుగోపాల్‌ను చంద్రాపూర్ ఆస్పత్రికి ప్రైవేటు అంబులెన్స్‌లో తరలిస్తుండగా రాజురా వద్ద టైర్ పంక్చర్ అయింది. దీంతో సుమారు 20నిమిషాల సమయం వృథా అయింది. ఆస్పత్రికి చేరుకుని అంబులెన్స్ నుంచి స్ట్రెచర్‌పై పడుకొపెట్టే సరికి ప్రాణాలు వదిలాడు.. పరీక్షించిన వైద్యులు పది నిమిషాల ముందు తీసుకువస్తే బతికేవాడని తెలిపారు. కాగా అంబులెన్స్‌లో ఆక్సిజన్ ఉన్నా పెట్టకపోవడంతో శ్వాస ఆడలేదని, టైరు పంక్చర్ కావడంతో సమయానికి ఆస్పత్రికి చేరలేక నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది.

పలువురి పరామర్శ

మరణవార్త తెలియగానే కెరమెరి ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఎంపీడీవో సిబ్బంది సుధాకర్, నాయకులు రూప్‌లాల్, శేశారావు, గ్రామ కార్యదర్శులు పార్థివ దేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

మిస్టరీ వీడేనా..!

- అనుమానాస్పదంగా గేడాం రాము మృతి
- సాధారణ మృతిగానే పోస్టుమార్టం రిపోర్టు
- ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులోనూ అదే అంశం
- అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- సాంకేతిక పరిజ్ఞాన సాయం కోరిన అధికారులు
- న్యాయం చేయాలంటున్న కుటుంబ సభ్యులు
- త్వరలో నిజానిజాలు వెలుగులోకి..



గేడాం రాము (ఫైల్)



ఆందోళన చెందుతున్న రాము తల్లిదండ్రులు, తమ్ముడు

సాక్షి, ఆసిఫాబాద్/ కెరమెరి: కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన గేడాం రాము మృతి వెనుక ఉన్న కారణాలు నేటికీ వెలుగులోకి రాకపోవడంతో అతడి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 16న మండంలోని చౌపన్‌గూడ గ్రామంలో జరిగిన ఓ పెళ్లికి హాజరై తిరిగి ఇంటికి బయలుదేరిన రాము 19న సుర్దాపూర్ గ్రామ శివారులో శవమై కనిపించడం అప్పట్లో కలకలం రేపింది. కుటుంట సభ్యుల ద్వారా సమాచారం తెలుసుకున్న కెరమెరి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 56 రోజులుగా అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టినా పోలీసులకు ఈ కేసు ఓ మిస్టరీగానే మారింది. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్టుల్లో మృతుడి శరీరంలో ఎలాంటి గాయాలు, విషపదార్థలు లేవని స్పష్టం కావడంతో చివరకు సాంకేతిక పరిజ్ఞాన సాయంతో అనుమానితుల కదలికలకు సంబంధించిన డేటా సేకరణలో పోలీసులు నిమగ్నమైనట్లు సమాచారం.

చిక్కుముడి వీడడం లేదు...

ఏప్రిల్ 16న ఇంటికి వెళ్తున్నట్లు తమ్ముడు సోముకి చెప్పి బయలుదేరిన రాము 19న ఒంటిపై నూలుపోగు లేకుండా విగతజీవిగా సూర్దపూర్ శివారులో కనిపించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడు రోజుల కిందటే రాము మృతిచెందడంతో శరీరం కుళ్లిన స్థితిలో ఉండగా.. ఆధారాలను గుర్తించడానికి వచ్చిన పోలీసు డాగ్ సైతం చేతులు ఎత్తేయడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. సాధారణంగా పోలీసులు ఇలాంటి క్లిష్టమైన కేసులు ఎదురైనప్పుడు చేధించడానికి కొంత సమయం తీసుకుంటారు. రాము కేసులోనూ అదే జరిగిందని భావిస్తున్నప్పటికీ చిక్కుముడి వీడకపోవడం గమనార్హం. తల్లిదండ్రుల ఆందోళన పోలీసులకు పట్టడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాంకేతిక అంశాలపై దృష్టి..

మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు చౌపన్‌గూడ, సూర్దపూర్ గ్రామానికి చెందిన కొందరిపై అనుమానాలు వ్యక్తం చేశారు. 'మా కుమారుడి అంత్యక్రియలు జరిగిన రోజు చౌపన్‌గూడ గ్రామానికి చెందిన అనేక మంది రాలేదు. ఇందులో ఏదో మతలబు ఉంది. ఆ గ్రామానికి చెందిన వారిని పిలిపించి గట్టిగా విచారించాలి.' అని రాము తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల వల్ల దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేక పోలీసులు చివరాఖరుగా సాంకేతిక అంశాల ఆధారంగా కేసు చిక్కుముడి విప్పాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అనుమానితుల సెల్‌టవర్ లోకేషన్లు, కాల్‌డేటాల ఆధారాలతో నిందితుల జాడా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వాటి సేకరణకు ప్రత్యేక సిబ్బందిని పురామాయించినట్లు తెలుస్తోంది. ఆ వివరాలు అందగానే కేసు కొలిక్కి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

విచారణ కొనసాగుతోంది..



రాము అనుమానాస్పద మృతిపై ఇంకా విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే అనుమానం ఉన్న వ్యక్తులను విచారించాం. పోస్టుమార్టం, ల్యాబ్ రిపోర్టులో ఎలాంటి ఆధారాలు లభించలేదు. కాని నగ్నంగా మృతదేహం ఉండడమే అనుమానస్పదంగా ఉంది. త్వరలో నిజనిజాలు తెలుస్తాయి. మృతి చెంది.. మూడు రోజుల తర్వాత సమాచారం అందడంతో ఆధారాలు లభించడం కష్టంగా మారింది. త్వరలో మిస్టరీ వీడుతుంది.

– నల్లా వెంకటేశ్, ఎస్సై, కెరమెరి

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

- 700 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం
- ఇద్దరిపై కేసు నమోదు



స్వాధీనపర్చుకున్న నాటుసారాతో పోలీసులు

నెన్నెల: మండలంలోని నెన్నెల చిన్నతండా, పెద్ద లంబాడితండాలతో పాటు నార్వాయిపేట గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. ఈ దాడుల్లో 700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 కేజీల బెల్లం, 8 లీటర్ల నాటుసారా, రెండు కేజీల పటికను స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై చిరంజీవి, మంచిర్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ మహేందర్‌సింగ్, నెన్నెల ఎస్సై శ్యాంపటేల్, చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సైలు లక్ష్మణ్, జీవన్‌రెడ్డి, నిర్మల పాటిల్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

రెబ్బెన: మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ శనివారం తెలిపారు. కళాశాలలో మొత్తం 150 సీట్లు ఉండగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 30, మెకానికల్ 30, సివిల్ 30, కంప్యూటర్స్ 30, మైనింగ్ 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో 27వ తేదీన సీసీసీ నస్పూర్‌లోని కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

టమాటా కిలో రూ.50



మార్కెట్‌లో టమాటా, పచ్చిమిర్చి

నెన్నెల: మండలంలో టమాటా ధర ఒక్కసారిగా పెరిగింది. కిలో రూ.50 పలుకుతోంది. వారం రోజుల క్రితం రూ.25 ఉన్న ధర ప్రస్తుతం రెట్టింపైంది. మండుతున్న ఎండలు, వాతావరణ పరిస్థితులు దిగుబడులు, దిగుమతులు తీరు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. పచ్చిమిర్చి ధర కూడా అమాంతం పెరిగింది. 15 రోజుల క్రితం కిలో రూ.60 ఉండగా రూ.120కి ఎగబాకింది. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా టమాటా దిగుబడి గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం ఇతర జిల్లాల నుంచి సరఫరా అవుతోంది. ఒక్కసారిగా పెరిగిన ధరలతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై నరేష్

బెల్లంపల్లిరూరల్: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఏరియాకు చెందిన జంపం సమ్మయ్య(35) చేపల వేటకు వెళ్తున్నట్లు శుక్రవారం సాయంత్రం ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో సమీపంలో వెతికారు. శనివారం సాయంత్రం బెల్లంపల్లి పోచమ్మ చిన్న చెరువులో మృతదేహం బయటకు తేలడంతో తాళ్లగురిజాల పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సమ్మయ్య మృతదేహంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. చేపలు పడుతున్న క్రమంలో సమ్మయ్య ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న ఇ.విజయ్‌లాల్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... విజయ్‌లాల్ కుటుంబ సభ్యులు ఈనెల 7న ఇంటికి తాళం వేసి ఆసిఫాబాద్‌కు వెళ్లారు. తిరిగి శనివారం ఇంటిరాగా ఇంటి తలుపు తాళాలు, బీరువా తాళం పగలగొట్టి అందులోని తులం బంగారం, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మురుగుశుద్ధి గుంతలో పడి వానరాల మృత్యువాత

- 20కిపైగా చనిపోయినట్లు అనుమానం



మృత్యువాతపడ్డ వానరాలు

రామకృష్ణాపూర్: స్థానిక సింగరేణి ఓపెన్‌కాస్ట్ కార్యాలయ సమీపంలో సింగరేణి నిర్మించిన మురుగునీటి శుద్ధి గుంతలో పడి దాదాపు 20 కోతులు మృత్యువాత పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏరియా ఆసుపత్రికి నాగార్జునకాలనీకి మధ్యలోని స్థలంలో సింగరేణి సంస్థ ఎస్‌టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించగా దానికి ఎటాంటి కప్పు వేయలేదు. దీంతో కోతులు అందులో పడి పైకి ఎక్కలేక మృతిచెంది ఉంటాయని తెలుస్తోంది. శనివారం కాలనీవాసులకు తీవ్ర దుర్గంధం రావడంతో అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది వచ్చి మృత్యువాత పడ్డ కోతులను గుంటలో నుంచి తొలగించారు. కాగా ఒకేసారి ఇన్ని వానరాలు మృతిచెందడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కోతులు ఎంతటి నీటిలోనుంచైనా పైకి వస్తాయి. అలాంటిది అవి మృత్యువాత పడడంపై మురుగునీటి శుద్ధి గుంత నుంచి ఏదైనా రసాయనాలు వెలువడి ఉంటాయన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో చెస్ క్రీడాభివృద్ధికి కృషి

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో చెస్ క్రీడాభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాత్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు శనివారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని క్రీడలతో సమానంగా చెస్‌ను సైతం వృద్ధిలోకి తీసుకువస్తామన్నారు. అందులో భాగంగా అధిక సంఖ్యలో క్రీడాకారులు చెస్‌పై ఆసక్తి చూపేలా పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా, ఆరు జిల్లాల స్థాయి పోటీలను నిర్వహించగా తాజాగా రాష్ట్ర స్థాయి పోటీలు సైతం జిల్లాలో ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మారుమూల ప్రాంతమైనప్పటికీ గోలేటిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు రావడం సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో సుమారు 124 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వివరించారు. ఆదివారంతో పోటీలు ముగుస్తాయని, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చే క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ఎం.రవీందర్, గోపాలక్రిష్ణ, కోశాధికారి మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, బాల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, కోచ్ కల్పన పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు